ఉచిత ఇసుక ఎప్పుడు?

గ్రామీణ ప్రజలకు తమ ఊరు వాగుల ఇసుక తెచ్చుకునేందుకు రెవెన్యూ, పోలీసుల అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో ఇసుక కొనుగోలు చేయక తప్పడంలేదు. ఇసుక రవాణదారులు ధరలు పెంచడంతో వారికి ఇంటి నిర్మాణం భారమవుతోంది. స్థానిక వనరులను ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోనే అవకాశం ఉన్నప్పటికీ అనుమతుల కొర్రీతో వినియోగించుకోలేకపోతున్నారు. ఉచిత ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు.

హుస్నాబాద్ రూరల్:



తోటపల్లి వాగు నుంచి ఇసుక తీస్తున్న కూలీలు

పేదవాడికి భారమైన ఇంటి నిర్మాణం

- ఇసుక తవ్వకాలకు అనుమతి నిరాకరణ
- గ్రామీణ ప్రజలకు ఉపయోగపడని వాగులు
- ఇబ్బందిపడుతున్న నిర్మాణదారులు

పట్టణాల్లో ఇసుకకు డిమాండ్ ఉండటంతో కొందరు గ్రూపులుగా ఏర్పడి ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.4 వేలకు విక్రయిస్తుండటంతో పేదలు కొనలేకపోతున్నారు. ప్రభుత్వం ఇటీవల ఇసుక క్వారీల నుంచి ఉచితంగా ఇస్తామని చెప్పడంతో నిర్మాణాలు చేపట్టినవారు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉచిత రవాణాకు అనుమతులు ఇస్తుందని ఎదురు చూస్తున్నారు. ఇసుక రవాణపై ఆంక్షలు సడలిస్తే సామాన్యులకు రూ.2 వేలకే దొరికే అవకాశం ఉంటుంది.

అనుమతుల సాకుతో అధిక ధరలు

హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని కోహెడ, హుస్నాబాద్, మద్దూరు, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల్లో ఇసుక రవాణాకు ఒక ట్రిప్పుకు రూ.250 చలానా తీసుకొని ఆర్డీఓ అనుమతులు ఇస్తున్నారు. రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారని వ్యాపారులు ఇసుకను పట్టణ శివారులో డంపు చేస్తున్నారు. తర్వాత ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వాగు నుంచి ఇసుక తీస్తే రూ.50 వేల వరకు జరిమానా కట్టాల్సి వస్తుందని భయపడి రైతులు వాగులో ఇసుక తెచ్చుకునేందుకు వెనుకాడుతున్నారు. స్థానిక ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకొని ఇళ్ల నిర్మాణానికి తక్కువ ధరలకు ఇసుక తెచ్చుకొనే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

మాఊరు వాగు ఇసుక మాకే ఇవ్వాలి



మాఊరు వాగు నుంచి ఇసుక తీసుకునే అవకాశం మాకే ఇస్తే పేదలకు ఆర్థిక భారం తగ్గుతుంది. వాగులు ఉన్న గ్రామస్తులకు కూడా రూ.4 వేలకు కొనుగోలు చేయాలంటే ఇళ్ల నిర్మాణం ఎలా చేపడతారు. ప్రభుత్వం స్పందించి ఇసుకను ఉచితంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– పొన్నబోయిన శ్రీనివాస్, మీర్జాపూర్

స్థానికులకు ఆంక్షలు వద్దు

స్థానిక అవసరాల కోసం వాగుల నుంచి ఇసుకు తీసుకోనే వెసులుబాటును అధికారులు కల్పించాలి. అధికారులు కట్టడి చేస్తుడటంతో సామాన్యులకు ఇసుక దొరకడం లేదు. పొరుగు గ్రామాల నుంచి తెచ్చుకోవాలంటే ఆర్థికంగా భారమవుతుంది. ఇంటి నిర్మాణానికి 20 ట్రిప్పుల ఇసుక అవసరం ఉంటే 40 ట్రిప్పుల ధర చెల్లించాల్సి వస్తుంది.

– శ్రీధర్, పొట్లపల్లి

ఆర్డీవో స్థాయిలోనే అనుమతులు



ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక అవసరం ఉంటే ఆర్డీవో స్థాయిలో డీడీలు ఇచ్చి అనుమతులు తీసుకోవాలి. గ్రామాల్లో ఇసుక తీసేందుకు అనుమతులు ఇవ్వలేం. ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వాలని చెప్పినా మాకు కలెక్టర్ నుంచి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉచితంగా ఇవ్వాలని ఆదేశాలు ఇస్తే ఇసుక సులభంగా దొరుకుతుంది.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, హుస్నాబాద్



ధర్మారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న రామకృష్ణ

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎన్‌ఎస్‌ఎస్ భారత ప్రభుత్వ రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు సేవాభావాన్ని కలిగి ఉండి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎన్‌ఎస్‌ఎస్ భారత ప్రభుత్వ రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1 స్పెషల్ క్యాంప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ స్థితిగతులను మార్చడానికి జాతీయ సేవా పథకం దోహదపడుతుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ మాజీ స్టేట్ లైజన్ ఆఫీసర్ శంకరయ్య, ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నవీన్ సౌద, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయభాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు వలంటీర్లు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

నంగునూరు(సిద్దిపేట): భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తిం కోసం పోరాటం చేసిన దొడ్డి కొమురయ్య చేసిన సేవలు మరువలేనివని ఎంపీటీసీ, కురుమ సంఘం మండల అధ్యక్షుడు బెదురు తిరుపతి అన్నారు. బుధవారం సిద్దన్నపేటలో కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 97వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొమురయ్య ఆశయ సాధనకు కృషి

సిద్దిపేటకమాన్: దొడ్డి కొమురయ్య జయంతిని సిద్దిపేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య నాయకులు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేశారు.



కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తిరుపతి

తెలంగాణ కురుమ సంఘం ఆధ్వర్యంలో..

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ కురుమసంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కేంద్రంలో దొడ్డి కొమరయ్య 97వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగడి బజారు వద్ద ఉన్న కొమురయ్య స్తూపానికి నివాళులర్పించారు. అసెంబ్లీలో కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని వక్తలు డిమాండ్ చేశారు.

మంచి పనుల కోసం ఆధునిక టెక్నాలజీ

సైబర్‌క్రైం ఏసీపీ శ్రీనివాస్

సిద్దిపూటరూరల్: మంచి పనులకోసం ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని, దానిని సరైన మార్గంలో వినియోగించాలని సైబర్ క్రైం ఏసీపీ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. బుధవారం తెలంగాణ సైబర్ సెల్ ఆధ్వర్యంలో ఇర్కోడ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ టెక్నాలజీ వినియోగం బాగా పెరిగిందని, టెక్నాలజీని మంచికి వినియోగించాలన్నారు. మానవ మనుగడ టెక్నాలజీతో ముడిపడి ఉందని, ఈ క్రమంలో సైబర్ నేరాలు పెరిగే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులు ఫోన్‌లో పంపే సమాచారాలకు స్పందించొద్దన్నారు. సైబర్ నేరాలకు అడ్డుకట్టవేసేందుకు తెలంగాణ పోలీసులు సైబర్ సెల్ కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. ఎవరైనా సైబర్ నేరాలబారిన పడితే 24 గంటలలోపు 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు జాతీయ సైబర్ హెల్ప్ లైన్ 1930 గురించి తెలిపి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, అధ్యాపకులు విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్

వడదెబ్బపై అవగాహన

వర్గల్(గజ్వేల్): అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులతో వడదెబ్బ తగిలే ప్రమాదముంటుందని వర్గల్ వైద్యాధికారిణి డాక్టర్ హరిత పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడదెబ్బ–జాగ్రత్తలు అవగాహన సదస్సుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్, ఎంపీఓ మౌలానా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత మాట్లాడుతూ వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడకు చేర్చాలని, చల్లటి వస్త్రంతో శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు తుడవాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, లేదా ఓఆర్‌ఎస్ తాగించాలని సూచించారు. వడదెబ్బతో అపస్మారకస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించొద్దని, వీలైనంత త్వరగా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. వీలైనంత వరకు ఎండల్లో తిరగడం మానుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వర్గల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట, గొల్లకుంట, కేశనాయక్‌తండా, మంచినీళ్ల బండ, పెద్దతండా, చౌటపల్లి, రామవరం, గోవర్ధనగిరి, ధర్మారం, నందారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిని అధికారులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అధికారులు సూచించారు. దళారులను అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు తిరుపతి, శివ, శ్రీనివాస్, రాజు, ఏఈఓలు సబియా, సింధూజ, ఐశ్వర్య, పంచాయతీ కార్యదర్శులు కవిత, శ్రీనివాస్, సంజీవ్,రాజు, సుభాష్, అనూష పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

కొండపాక(గజ్వేల్): కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని గిరాయిపల్లి, రాంపల్లి, ఖమ్మంపల్లి, కుకునూరుపల్లి మండంలోని మేదినీపూర్, బొబ్బాయిపల్లి,మాత్‌పల్లి, తిప్పారం గ్రామాల్లో ఐకేపీ మండల ఏపీఎం శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కొండాపూర్, అందె, అల్వాల, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లిలో వ్యవసాయ విస్తరణ అధికారులు నవ్య, అఖిల్ హుస్సేన్ బుధవారం రైతులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

దళారులకు విక్రయించొద్దు

దుబ్బాకరూరల్: దుబ్బాక, అక్బర్‌పేట భూంపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఐకేపీ ఏపీఎం దాకయ్య మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి మోస పోవద్దన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ఆంజనేయులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్ అన్నారు. బుధవారం గట్లమల్యాల, పాలమాకుల, ఖాత గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏగ్రేడ్ రకానికి రూ.2,203, బీ గ్రేడ్‌కు రూ.2,183 చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో ఏఓ గీత, ఏఈఓలు, సీసీలు, గ్రామైఖ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



కేశనాయక్ తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మద్దతు ధర పొందాలి

గజ్వేల్‌రూరల్: ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపీడీవో ప్రవీణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అహ్మదీపూర్, కొల్గూరు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీవో దయాకర్, మండల ప్రత్యేకాధికారి సునీత, ఏపీఎం యాదగిరిలతో కలిసి ప్రారంభించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

మిరుదొడ్డి(దుబ్బాక): సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే మోసాలకు గురికాకుండా ఉంటామని మిరుదొడ్డి ఎస్ఐ పర్శరామ్ అన్నారు. మండల పరిధిలోని కాసులాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన సదస్సులో పలు సూచనలు చేశారు.

దుబ్బాకటౌన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక ఎస్సై గంగరాజు అన్నారు. బుధవారం దుబ్బాక ప్రభుత్వ ఉన్నత (కేసీఆర్) పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలకు చెందిన రాధిక, సాయివీర్, అక్షయ్, కీర్తన సైబర్ అంబాసిడర్‌గా ఎంపికై ఐదు రోజులు శిక్షణ తీసుకున్న సందర్భంగా వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

గజ్వేల్‌రూరల్: సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి పోవద్దన్నారు.



కాసులాబాద్‌లో అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ పర్శరామ్

క్లుప్తంగా

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన సిద్దిపేట బీఆర్‌ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటకు చెందిన ముగ్గురు మున్సిపల్ కౌన్సిలర్లు బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనకు ఆకర్షితులైన సిద్దిపేటకు చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సాకి బాల్‌లక్ష్మీ, శ్రీదేవి, రియాజ్ సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. కార్యక్రమంలో పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరణ



బస్సు సర్వీసు ప్రారంభోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): హుస్నాబాద్ నుంచి కొండాపూర్ గ్రామానికి బస్సు సర్వీసు పునరుద్ధరించారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు గ్రామం నుంచి హుస్నాబాద్‌కు బస్సును నడపాలని మంత్రి పొన్నం ప్రభాకర్, డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో స్పందించిన మంత్రి బస్సు సర్వీసు పునరుద్ధించాలని డిపో అధికారులను ఆదేశించారు. బస్సు సర్వీసు ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇన్‌చార్జి ఎంఈవోగా దేశిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో దేశిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూళ్మిట్ట మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా దేశిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన నంగునూరు, హుస్నాబాద్ ఎంఈవోగా పనిచేస్తున్నారు. ఇక్కడ ఎంఈవోగా పని చేసిన నర్సింహారెడ్డి ఇటీవల పదవి విరమణ పొందారు. మద్దూరు, దూళ్మిట్ట మండలాల కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత



ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై మహేష్

హుస్నాబాద్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేసినట్లు బుధవారం ఎస్ఐ మహేష్ తెలిపారు. హుస్నాబాద్‌కు చెందిన దొంతరవేణి రాజ్‌కుమార్ మార్కెట్‌లో తన మొబైల్ పోగొట్టుకున్నాడు. వెంటనే హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్(సీఈఐఆర్) వెబ్‌సైట్‌లో ఫిర్యాదుదారుడి ఫోన్ నంబర్ బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తి ఆ ఫోన్‌లో సిమ్ కార్డ్ వేయడంతో వివరాలు తెలుసుకున్నారు. వెంటనే దానిని స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేశారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

మద్దూరు(హుస్నాబాద్): దొంగతం కేసులో నిందితుడికి హుస్నాబాద్ కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ బుధవారం తెలిపారు. దూళ్మిట్ట మండల కేంద్ర శివారులో ఉన్న ఇండస్ టవర్ రూమ్ తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీలు ఎత్తుకెళ్లారని టవర్ విజిలెన్స్ టీమ్ మెంబర్ హరికృష్ణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన పోలీసులు దూళ్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గుజ్జుక బాబును అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా చేసిన నేరం ఒప్పుకోవడంతో హుస్నాబాద్ కోర్టులో హాజరుపరచగా, నిందితుడికి జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని కరీంనగర్ జైలుకు తరలించారు. గతంలో ఇదే కేసులో ముక్క రమేష్, చింతల భిక్షపతిని కూడా రిమాండ్‌కు తరలించామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆస్తి పన్ను రాయితీ గడువు పెంపు

హుస్నాబాద్: 2024–25 సంవత్సరానికి ఆస్తి పన్ను మొత్తం నుంచి ఐదు శాతం రాయితీ కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించే వారికి గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడగించినట్లు పేర్కొన్నారు. నల్లా, నీటి పన్ను, ప్రకటనలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

◆ ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రజలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గణేష్ రెడ్డి కోరారు. బుధవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఖాజీపూర్‌లోని నర్సరీని సందర్శించి పనులను పరిశీలించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని నర్సరీలో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు సుభాష్, కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ స్వలాభం కోసమే కాంగ్రెస్‌లో చేరిక

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్‌కు చెందిన ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు స్వలాభం కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారని పట్టణ ఆ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్నపుడు పార్టీలో ఉండి, అధికారం కోల్పోయిన వెంటనే కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వెంటనే బీఆర్‌ఎస్‌ను విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు వజీర్, సాయి ఈశ్వర్, నాగరాజు రెడ్డి, నాయకులు నరేష్, ప్రేమ్ పాల్గొన్నారు.

◆ సదరం క్యాంపు ఏర్పాటు చేయండి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపు ఏర్పాటు చేయాలని ముదిరాజ్ మండల మహాసభ అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో ఆయన మాట్లాడుతూ పక్షవాత రోగులకు ఫించన్లు రావడం లేదన్నారు. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే వైద్యులు వారికి వైకల్యం లేదని ధ్రువీకరించడంతో సర్టిఫికెట్ ఇవ్వడంలేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని హుస్నాబాద్ ప్రజల కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి అర్హులకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

◆ బీమా సొమ్ము అందజేత

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి పొదుపు సంఘం సభ్యుడు ఐలేని మహేందర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడికి సామూహిక బీమా కింద రూ.81,609 మంజూరైంది. ఆ మొత్తాన్ని మృతుడి కుటుంబానికి బుధవారం సమితి అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అందజేశారు.

◆ యాత్రను జయప్రదం చేయండి

బెజ్జంకి(సిద్దిపేట): మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజ్యాంగ రక్షణ యాత్రను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, మాల సాంస్కృతిక చైర్మన్ దేవయ్య పిలుపునిచ్చారు. బెజ్జంకిలో రక్షణ యాత్ర కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. యాత్ర ఏప్రిల్ 5వ తేదీన కరీంనగర్‌కు చేరుతుందన్నారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల శేఖర్ పాల్గొన్నారు.

◆ పెండింగ్ వేతనాలు చెల్లించండి

దుబ్బాకరూరల్: ఉపాధి హామీ కూలీల బకాయి చెల్లించాలని డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్‌శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రాజక్కపేట మధిర గ్రామం ఎల్లాపూర్‌లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని, వారికి పనిదినాలను 200 రోజులకు పెంచాలన్నారు. అంతేకాకుండా రవాణా చార్జీలు, ఇతర అలవెన్సులు చెల్లించాలన్నారు.

◆ బీఆర్‌ఎస్‌కే మాదిగల మద్దతు

సిద్దిపేటఅర్బన్: మాదిగల అభివృద్ధికి కృషి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని, ఎంపీ ఎన్నికల్లో తామంతా బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తామని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దబ్బెట శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మీడియా పాయింట్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాదిగలకు పెద్దపీట వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక ఎంపీ సీటు కూడా కేటాయించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్లమ్మ తల్లికి పూజలు

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేటలో ఎల్లమ్మ తల్లి ఆలయ ఉత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ నిర్వాహకులు నరేందర్ గౌడ్, వెంకట్ గౌడ్ ఎల్లాగౌడ్ సన్మానించారు.

◆ నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: కేంద్రం తెచ్చిన నూతన విద్యా విధాన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మహాసభలో మాట్లాడుతూ నూతన విద్యా విధాన పాలసీ రద్దుకు విద్యార్థులు ఉద్యమించాలన్నారు. ఎస్ఎఫ్ఐ శాస్త్రీయ విద్యా విధానం కావాలని కోరుతుంటే కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

◆ పెద్దమ్మ తల్లి దేవాలయంలో చోరీ

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని లక్ష్మీనగర్ పెద్దమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ తలుపులను పగులగొట్టిన దొంగలు అమ్మవారికి అలంకరించిన రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల విలువైన వస్తువులను ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. చోరీ ఘటనపై మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పర్శరామ్ తెలిపారు.

◆ బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్, పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని కోమటిబండలో బుధవారం జరిగింది. కోమటిబండకు చెందిన షహబాత్ శ్రీకాంత్ లక్కీ చికెన్ సెంటర్‌షాపులో ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు దాడిచేసి 8.9 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

◆ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్ శివారు రింగురోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వేములవాడకు చెందిన రఫి హైదరాబాద్‌లో ఉంటున్న తన చెల్లెలు జాస్మిన్ కురానాతో పాటు ఆమె ఇద్దరు పిల్లలను కారులో తీసుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ రింగురోడ్డు వద్ద లారీ, కారు ఢీకొనడంతో రఫికి స్వల్పంగా, జాస్మిన్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.